క్లుప్తంగా

29న రాష్ట్ర మహాసభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: అన్నమయ్య జిల్లాలో ఈ నెల 29, 30 తేదీల్లో ఏపీ గిరిజన సమాఖ్య మూడవ రాష్ట్ర మహా సభలను నిర్వహిస్తున్నట్లు ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని తిలక్ నగర్‌లో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాల్లో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలు, సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సభను గిరిజనులు జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నాయకులు విశ్వనాధ నాయక్ పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనపై ప్రభుత్వాలు స్పందించాలి

కడప కల్చరల్ : మణిపూర్‌లో ఇటీవల ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన అత్యంత హేయమైనదని, ప్రభుత్వాలు ఈ అంశంపై వెంటనే స్పందించాలని ఇన్‌స్రూ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ్‌రెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ అమీన పర్వీన్ కోరారు. మణిపూర్‌లోని జాతుల కలహాలు యువతులను వివస్త్రలుగా చేసే స్థాయికి దిగజారాయంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయో అర్థం కాని స్థితి నెలకొందన్నారు. ఈ సంఘటనకు దారితీసిన పరిస్థితులను విచారించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అమ్మాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీ నాగరాజు

కడప అగ్రికల్చర్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను షాపు నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని బద్వేల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు పేర్కొన్నారు. గురువారం కడప ఎస్‌ఎఫ్‌ఎస్ స్ట్రీట్‌లోని పలు షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులకు సంబంధించి లైసెన్సులు, స్టాక్ వివరాలు, ధరల బోర్డు, బిల్లులు, ఇన్‌వాయిల్, వే బిల్లులు, తూకాలు, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రికార్డు నిర్వహణపై యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అమ్మితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాతాదారుల సహకారంతోనే బ్యాంకు అభివృద్ధి

కడప కల్చరల్ : ఖాతాదారుల సహకారంతోనే ఏ బ్యాంకు అయినా అభివృద్ధి చెందగలదని బ్యాంకు ఆఫ్ బరోడా సీనియర్ మేనేజర్ కె.మధుమోహన్ అన్నారు. ఆ బ్యాంకు 116వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం నగరంలోని ఏడురోడ్ల వద్ద గల బ్యాంకు శాఖలో కేక్ కట్ చేసి ఉత్సవాలను నిర్వహించారు. స్థానిక ప్రముఖులు పోతుల వెంకట్రామిరెడ్డి, వై.సంజీవరెడ్డి బ్యాంకు సిబ్బందితో కలిసి మేనేజర్ ఆధ్వర్యంలో బ్యాంకు వ్యవస్థాపకులు మహరాజా, రెండవ శయాజీరావు గైక్వాడ్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంకు క్రెడిట్ ఆఫీసర్లు జె.రాజా, బి.శిల్ప, ఆపరేషన్ అధికారి బి.రత్నాలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



పేదలకు భోజన పాకెట్ ఇస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన దూదేకుల సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థానిక పాత కలెక్టరేట్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు చిన్న రాజా, యూత్ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కమాల్ బాషలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కె.పీర్ మహమ్మద్ (బుజ్జన్న) నూతనంగా ఎన్నికైన సందర్భంగా వారు 120 మందికి పైగా నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేపీ హుసేన్, రిటైర్డ్ ఎండీఓ హుసేన్, రిటైర్డ్ ఎస్ఐ కుళాయప్ప, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో బీజేపీ విఫలం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశ ప్రజలకు రక్షణ కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతమ్‌రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య ఆరోపించారు. గురువారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న విధ్వంసకాండపై ప్రధాని మోదీ కనీసం స్పందించడం లేదని విమర్శించారు.పైగా అక్కడ ఏం జరుగుతుందో తెలియకూడదని ఇంటర్నెట్ కనెక్షన్లు కూడా కట్ చేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు పాల్గొన్నారు.

శ్రీహరి డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

– 3.15 సీజీపీఏ సాధించిన కళాశాల



న్యాక్ ఏ గ్రేడ్ లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

వైవీయూ: కడప నగరంలో యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీహరి డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ×ఏ॰ గ్రేడ్ లభించింది. జూలై నెల 13, 14 తేదీల్లో న్యాక్ పీర్ కమిటీ చైర్మన్ డాక్టర్ ధర్మజిత్‌సింగ్ పర్మార్ (వైస్ చాన్సలర్, శాంత్‌బాబా సింగ్ యూనివర్సిటీ, జలందర్, పంజాబ్), డా. మధులిక దూబే (స్టాటిస్టిక్స్ విభాగాధిపతి, డా. బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ, లక్నో, ఉత్తరప్రదేశ్), డా. కిరణ్‌రెడ్డి (ప్రిన్సిపాల్, ఆచార్య విద్యాసంస్థలు, బెంగళూరు)ల బృందం విచ్చేసి కళాశాలలో లభిస్తున్న సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, బోధనలో నాణ్యత తదితర అంశాలన్నింటీ పరిశీలించి నివేదికను న్యాక్‌కు పంపారు. నిబంధనల మేరకు కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ అర్హత ఉందని నిర్ధారించి కుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఆవరేజ్ (సీజీపీఏ) 3.15 పాయింట్లు కేటాయించింది. కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ లభించడం పట్ల కళాశాల కరస్పాండెంట్, వైవీయూ పాలకమండలి సభ్యుడు జి. సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ గ్రేడింగ్ లభించడం పట్ల ఆయన కళాశాల అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయభారతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో పాత కలెక్టరేట్ మరమ్మతు పనులు

కడప కల్చరల్ : పాత కలెక్టరేట్ భవనానికి పునర్ వైభవం లభించనుంది. ఈ భవనానికి అవసరమైన మరమ్మతులు చేసి పునరుద్ధరించేందుకు జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈమేరకు గురువారం కలెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పాత కలెక్టరేట్‌కు మరమ్మతులు చేసి ఆధునీకరించేందుకు నిర్ణయించామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అద్భుతమైన ఈ కట్టడం మొన్నటి తరానికి చెందిన గొప్ప స్మారక చిహ్నమన్నారు. 2016లో నూతన కలెక్టరేట్‌కు కార్యాలయాలు మార్చి అధికారిక కార్యకలాపాలన్నీ అక్కడి నుంచే నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని కొన్ని గదుల్లో అధికారుల అనుమతి మేరకు పలు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం అందులో ఎక్సైజ్, ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్, పాత ట్రెజరీ కార్యాలయం తదితర తొమ్మిది శాఖలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పాత కలెక్టరేట్‌కు మరమ్మతులు చేపట్టి అవసరమైన వసతులతో అనువుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పాత కలెక్టరేట్‌లో ఉన్న ఈ కార్యాలయాలు ఇతర భవనాల్లోకి మార్చాలని, వెంటనే పూర్తిగా ఖాళీ చేయాలన్నారు. అద్భుతమైన భవనాన్ని కాపాడుకునేందుకు మరమ్మతులు చేపట్టేలా స్పందించినందుకు జిల్లా అధికారుల నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

దొరల గోరీలను పరిరక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని దొరల గోరీలను అధికారులు పరిరక్షించాలని, రహదారి వెడల్పు పేరిట తొలగించడం తగదని అఖిలపక్ష నాయకులు అన్నారు. గురువారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకుడు హరిప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సి.సుబ్రమణ్యం, బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప, హేతువాద సంఘం నాయకుడు సీఆర్‌వీ ప్రసాద్, హోలి క్యాథడ్రల్ చర్చి బిషప్ కె.శ్యామూల్‌బాబులు మాట్లాడారు. కడప నగర అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని అన్నారు. అయితే అభివృద్ధి పేరిట గోరీల కూల్చివేతకు దిగడం ఆక్షేపణీయమన్నారు. దొరల గోరీలకు 217 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఆనాటి మద్రాస్ సివిల్ సర్వీస్ అధికారిణి, న్యాయమూర్తులు, ఇంజనీర్లు, మిలిటరీ అధికారుల సమాధులు అక్కడ ఉన్నాయన్నారు. వంద సంవత్సరాలు దాటిన ప్రతి కట్టడం వారసత్వ సంపద కిందికి వస్తుందన్నారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని యూరోపియన్ సెమెట్రిలాగా ఇక్కడి దొరల గోరీలను సంరక్షించాలన్నారు. దొరల గోరీల చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్ విజయరామరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో క్రైస్తవ ప్రతినిధి ఎఫ్రామ్, పాస్టర్ మాణిక్యం, టీడీపీ నాయకులు మల్లేషు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యను పటిష్టం చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించి ఇంటర్ విద్యను పటిష్టం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు కడప విభాగ కన్వీనర్ మల్లికార్జున అన్నారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్ఐవో రమణరాజును కలిసి ఏబీవీపీ తరపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ కళాశాలలకు కనీస మౌలిక వసతులు లేవన్నారు. దీంతోపాటు ఇంటర్ చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కూడా ఇవ్వలేదన్నారు. చైతన్య, నారాయణ జూనియర్ కళాశాలలు ఐఐటి, జేఈఈ, నీట్, ఎంసెట్ లాంటి పేర్లతో విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి హరి, వంశీ, రాజు, ఆశోక్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

కడప కల్చరల్ : కడప నగరంలోని మురాదియా నగర్‌లో వెలసి ఉన్న ఆస్థానె- మురాదియా దర్గాలో నూతన ఇస్లామిక్ సంవత్సరం జెండా ఆవిష్కరణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లాబాష సాహెబ్ జెండాను ఆవిష్కరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, హిందూ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి

కమలాపురం : రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శించి ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలని ఏడీఏ ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఏడీఏ కార్యాలయంలో కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే ఇన్‌చార్జిలకు ఈ–క్రాప్ బుకింగ్ యాప్ పై శిక్షణ నిచ్చారు. ఈ క్రాప్ ఆఫ్ టెక్నికల్ పర్సన్ వినోద్ ఆచారి ఈ–క్రాప్ బుకింగ్ యాప్ గురించి వీడియో ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తూ అవగాహన కల్పించారు. అంతకు ముందు ఏడీఏ మాట్లాడుతూ ఏ మాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలన్నారు. తాము ఈ–క్రాప్ బుకింగ్ చేయాల్సిన సర్వే నెంబర్‌లోకి వెళ్లి ఆన్ చేస్తేనే మొబైల్ కెమెరా ఆన్ అవుతుందని, అపుడు మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. సర్వే నెంబర్‌కు కొంత దూరంలో ఉన్నా కెమెరా ఆన్ కాదన్నారు. రైతు ఒక చోట ఉండి మరో చోట ఈ–క్రాప్ బుకింగ్ చేయాలంటే కుదరదన్నారు. సాంకేతికతను జోడించి ఈ సారి ఈ–క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి తరుణంలో అవినీతికి పాల్పడే ఛాన్స్ లేదన్నారు. అలాగే పంట ఎక్కడైతే సాగులో ఉందో అక్కడికి తప్పని సరిగా వెళ్లి క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అలాగే శనివారం మండల స్థాయిలో ఏఓల ఆధ్వర్యంలో కూడా శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీఏఏ, వీఆర్ఓ, సర్వేయర్‌ల బృందం వెళ్లి క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్, క్రాప్ బుకింగ్, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధర ఇలా అన్ని రకాల పథకాలకు ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. పీఎం కిసాన్ 14వ విడత డబ్బులు పడాలంటే ఈకేవైసీ తప్పని సరిగా చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు సరస్వతి, సాయిజ్యోతి, సంతోషిని, శ్రీకాంత్‌రెడ్డి, ఏఈఓ దస్తగిరి పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న హెడ్మాస్టర్ శివ నాగమునెమ్మ

వేంపల్లె : విద్యార్థి దశ నుంచి ఎన్‌సీసీ కోర్సు అలవరుచుకోవాలని ఎన్‌సీసీ ఆఫీసర్ సీఓ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా తెలిపారు. గురువారం వేంపల్లె తలిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ జాతీయ క్యాడెట్ కార్ప్స్ ఎంపికలు నిర్వహించారు. హెడ్మాస్టర్ శివ నాగమునెమ్మ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ అశోక్ కుమార్, హవల్దార్ సందీప్ కుమార్ సింగ్ కౌర్, పాఠశాల సీపీఓ గోపాల్ నాయక్‌లతో కలిసి 50 మంది ఎన్‌సీసీ క్యాడెటర్లు, 8 మంది రిజర్వ్ క్యాడెటర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ దేశానికి సేవ చేసే భాగ్యం ఈ కార్యక్రమం ద్వారా రావడం విద్యార్థులు చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. అంతేకాక సేవా కార్యక్రమాల ద్వారా లభించే సర్టిఫికెట్‌వల్ల విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కూడా వరిస్తాయని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల సీట్లను పాత పద్ధతిలో భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య విద్య కళాశాలల్లో ఉన్న సీట్లను పాత పద్ధతిలో భర్తీ చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య కళాశాలల్లో ఉన్న సీట్లను కన్వీనర్ కోటా ద్వారా పాత పద్ధతిలో భర్తీ చేయాలన్నారు. సీపీఎం నాయకులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రూ. 20 వేలు ఆర్థికసాయం

కడప ఎడ్యుకేషన్: వేముల మండలం కుప్పకుంట పల్లెకు చెందిన సీఏ చదువుతున్న వెన్నపూస రాజేష్ రెడ్డికి ఓసీ సంఘం తరుపున గురువారం రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కందనూరు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. వీరి కుటుంబం ఆర్థిక ఇబ్బందులలో ఉందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఓసీ సంఘం దృష్టికి తెచ్చారన్నారు. దీంతో ఓసీ సంఘం తరుపున సీఏ చదువుతున్న విద్యార్థి రాజేష్‌రెడ్డి నివాసానికి వెళ్లి రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు.

23న ఉచిత వైద్యశిబిరం

రాజంపేట : నూనివారిపల్లె నలంద రోడ్డులోని తోట రామయ్య క్లీనిక్‌లో ఈ నెల 23న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి చెందిన రేడియంట్ హాస్పిటల్(పల్మనాలజి అండ్ మల్టీస్పెషాలిటీ)కు చెందిన డా.రెడ్డివరప్రసాద్ బాబు వైద్యశిబిరానికి హాజరవుతారన్నారు. 9515170323 నెంబరులో సంప్రదించాలన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో కలసి పాఠాలు వింటున్న డీఈఓ రాఘవరెడ్డి

కమలాపురం : పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం పట్టణంలోని జడ్పీ బాయ్స్, గర్ల్స్ హైస్కూల్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు చేసే బోధనా పద్ధతులను పరిశీలించారు. టీచర్స్ డైరీలు, లెసన్ ప్లాన్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి సిలబస్ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. జనవరి నుంచి రివిజన్, స్లిప్ టెస్ట్ నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కేఓఆర్ఎం అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కందుల ఓబుల్‌రెడ్డి మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న అంబటి మల్లికార్జునకు కర్నూల్ రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పెర్ఫార్మెన్స్ ఎవాల్యుషన్ ఆఫ్ ఈక్విటీ స్కీమ్స్ ఆఫ్ పబ్లిక్ అండ్ ప్రైవేటు సెక్టార్ మూచువల్ ఫండ్స్ ఏ కంపరిటివ్ స్టడీ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. వైవీయూ ఆచార్యులు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఈ పరిశోధన చేశారు. అంబటి మల్లికార్జునకి పీహెచ్‌డీ రావడంపై కేఓఆర్ఎం కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, సెక్రటరీ లిఖిత, ప్రిన్సిపాల్ గిరిధర్‌లతోపాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.

మొహర్రం కార్యక్రమాలు ప్రారంభం

చిన్నమండెం : ఉమ్మడి కడప జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మొహర్రం వేడుకలు గురువారం చిన్నమండెం మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్లమకాన్‌లో ఉంచిన పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు పీర్లమకాన్‌కు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



చిన్నమండెం పీర్ల మకాన్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

సేవకు సలాం



కరోనా సమయంలో..



కరోనా సమయంలో పింఛను అందజేస్తున్న వలంటీర్ అనూష

ఈమె పేరు పల్లవలి అనూష. నగర పాలక సంస్థ పరిధిలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈమె ప్రతి నెలా ఇంటింటికి వెళ్లి అవ్వాతాతలకు పింఛను అందిస్తోంది. గతంలో కరోనా మహమ్మారి వ్యాపించిన సమయంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. అయినా అనూష కరోనాను సైతం లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్లి పింఛను అందజేసి వృద్ధుల దీవెనలు పొందింది. వృద్ధుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ అవసరమైన సేవలను అందించింది. – కడప వైఎస్ఆర్ సర్కిల్

ఆప్యాయంగా పలకరింపు..



మా వలంటీర్ అనూష ప్రతి నెలా ఒకటవ తేదీ వచ్చిందంటే చాలు తెల్లవారక ముందే ఇండ్ల ముందుకు వచ్చి అవ్వా అంటూ నిద్ర లేపి ఆప్యాయంగా పలకరించి నవ్వుతూ పింఛను ఇచ్చి వెళుతుంది. కరోనా సమయంలోనూ భయపడకుండా మా ఇంటి వద్దకు వచ్చి పింఛను అందించింది. అంతేకాకుండా ఆరోగ్య సమస్యలపై ఎప్పటికపుడు తెలుసుకుంటూ సూచనలను ఇచ్చేది. – కమాల్ బీ, 45వ డివిజన్, ఊటుకూరు

బాధ్యతగా సేవలు



వలంటీర్ నుంచి పింఛన్ పత్రాలను అందుకుంటున్న షఫీబాష

వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. తమ పరిధిలోని 50 ఇళ్ల ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్నారు. ఈ క్రమంలో కడప నగరం 29వ వార్డులో షఫీబాష అనే వృద్ధ వికలాంగుడు చిన్న షాపు పెట్టుకుని అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని పొరపాటో.. అధికారుల తప్పిదమో ఆయన అద్దెకు ఉంటున్న ఇంటి పన్నుకు ఆయనకు సంబంధించిన ఆధార్‌కార్డు లింక్ అయ్యింది. దీంతో ఆయనకు వస్తున్న అన్ని ప్రభుత్వ పథకాలన్నీ నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంత వలంటీర్ ఆయేషా చొరవ తీసుకుంది. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అధికారులు సమస్య పరిష్కరించారు. దీంతో మళ్లీ అన్ని రకాల పథకాలు ఆ వృద్ధుడికి అందుతున్నాయి. – కడప ఎడ్యుకేషన్

అన్ని పథకాలు వస్తున్నాయి..



మా వార్డు వలంటీర్ ఆయేష సహకారంతో నాకు మళ్లీ అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందాయి. నాకు పింఛన్, ఇంటి స్థలంతోపాటు పిల్లోడికి అమ్మ ఒడి కూడా వచ్చింది. అలా అన్ని రకాల ప్రభుత్వ పథకాలు తిరిగి వచ్చాయి. వలంటీర్ సేవలు మరచిపోలేను. – షఫీబాష, 29వ వార్డు, కడప

రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామంలో గురువారం రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో పంపిణీ చేశామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వైఎస్ఆర్ జిల్లా ఉత్పాదకత (పి.ఎస్.ఐ.) నిధులతో రైతులకు సబ్సిడీ కింద 35 మంది రైతులకు పీవీసీ పైపులు, పెట్రోలో పంపులు, బ్యాటరీ, స్ప్రేయర్లు, 9 చెక్కల గొర్లను రైతులకు అందజేశామన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అత్యాధునిక వ్యవసాయ పనిముట్లను 90 శాతం సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీలకు, 80 శాతం సబ్సిడీతో ఓసీ, బీసీ, మైనార్టీ వారికి వాటర్ షెడ్ పథకంలో ఇస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు పీడీ నాగరత్నమ్మ, వాటర్ షెడ్ బీపీఓ వేణుగోపాల్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ జె.లక్ష్మిరెడ్డి, వ్యవసాయాధికారి రమేష్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ జె.వెంకటమ్మ, సర్పంచ్ పి.సుబ్బమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవహర్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాజంపేట టౌన్ : జగనన్న సురక్ష బృహత్తర కార్యక్రమం అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. మండలంలోని ఆకేపాడులో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని అర్హులైన వారికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పంపిణీ చేస్తున్న కొన్ని సర్టిఫికెట్లు జీవితాంతం ఉపయోగపడగలవని తెలిపారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా, ఏ మాత్రం శ్రమ లేకుండా ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లను ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటికి వచ్చి ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లను అందజేస్తున్నారని తెలిపారు. ఎప్పుడూ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం జగన్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ వి.గంగిరెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబర్ గౌస్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రైల్వేకోడూరు : మహిళల అభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సచివాలయం 2 పరిధిలో అంకమ్మనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఏ గడపకూ వెళ్లినా వైఎస్సార్‌సీపీ అందించిన సంక్షేమ పథకాల గురించి చెబుతున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలన కాలంలో 98శాతం పైగా హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనవైపు దేశం మొత్తం చూస్తుందన్నారు. మాట తప్పని, మడమ తిప్పని మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను చేసి చూపిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీకు అందరికీ తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా బాసటగా నిలచి దీవెనలు, ఆశీర్వాదాలు అందజేయాలని కోరారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, సుబ్బరామరాజు, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, ఎంపీడీఓ జాషువా, ఎంపీటీసీలు పుష్పలత, జనార్దన్ రాజు, బండారు మల్లికార్జునలు, వినోద్‌కన్నా, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.